# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.**

2. **ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమస్యలను ఇరు రాష్ట్రాలు సమన్వయంతో పరిష్కరించుకోవాలని కేంద్ర హోంశాఖ సూచించింది.**

3. **ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో రథసప్తమి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి.**

4. **తెలంగాణలో నిర్ణీత గడువులోపు కులగణన పూర్తిచేశామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**

5. **ఆంధ్రప్రదేశ్‌లోని ఇంజినీరింగ్ కళాశాలల్లో నాణ్యత ప్రమాణాల పెంపుపై యాజమాన్యాలు దృష్టి సారించాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.**

===========================

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఢిల్లీలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో 1,326 కి.మీ మేర ప్రస్తుతం కవచ్ సాంకేతిక ఉందని, మరో వెయ్యి 26 కి.మీ.మేర ఈ సాంకేతికనుఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఒక వెయ్యి 560 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌లు నిర్మించామన్నారు. రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి 9 వేల 417 కోట్ల రూపాయలు కేటాయించామని అశ్విని వైష్ణవ్ తెలియజేస్తూ...

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నటులు, 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' వ్యవస్థాపకులు సోనూసూద్ నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి సోనూసూద్ ఫౌండేషన్ తరపున నాలుగు అంబులెన్స్‌లను అందచేశారు. అనంతరం ఈ నాలుగు అంబులెన్స్‌లను ముఖ్యమంత్రి

ప్రారంభించారు. మర్యాద పూర్వకంగా తనను కలవడానికి వచ్చిన సోనూసూద్‌ను ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఆరోగ్య సంరక్షణలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' భాగస్వామి అయినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

---------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమస్యలను ఇరు రాష్ట్రాలు సమన్వయంతో పరిష్కరించుకోవాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సూచించారు. విభజన సమస్యలపై తెలుగు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి నిన్న ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విభజన చట్టంలోని సంస్థల ఆస్తులు, అప్పుల పంపకాలపై ప్రధానంగా చర్చ జరిగినట్లు అధికారులు తెలిపారు. రెండు రాష్ట్రాల్లో మౌలిక వసతుల ప్రాజెక్టులకు మద్దతు ఉంటుందని, నిధుల పంపకాల్లో సమస్యలపై సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని హోంశాఖ సూచించింది. 9, 10 షెడ్యూల్‌లోని సంస్థల విషయంలో న్యాయ సలహాలు తీసుకొని ముందుకెళ్లాలని ఈ సందర్భంగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణ సామాజిక ఆర్థిక గణన, ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు సంబంధించి ఏకసభ్య కమిషన్ నివేదికపై చర్చించేందుకు ఈ ఉదయం 11 గంటలకు శాసనసభ, శాసనమండలి ప్రత్యేకంగా సమావేశం కానున్నాయి. ఈ మేరకు శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశాలకు ముందు శాసనసభ కమిటీ హాలులో ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి సమావేశమై ఈ రెండు నివేదికలపై చర్చించి, ఆమోదించనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

రథసప్తమి పర్వదినాన్ని ఈరోజు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. మాఘమాస శుక్లపక్ష సప్తమి సూర్యజయంతి రోజున ఈ పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ భూమిపై సమస్త జీవ రాశులు సుభిక్షంగా ఉన్నాయంటే... అందుకు కారణం సూర్యభగవానుడు... ప్రతిరోజు సూర్యారాధన శ్రేయస్కరమని ఆరోగ్య శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకాకుళం అరసవల్లి శ్రీ సూర్యనా రాయణస్వామి వారి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది. కాగా రథసప్తమి ని పురస్కరించుకొని ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 లకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో రథసప్తమి వేడుకలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న ఈ వేడుకలలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, అరసవల్లి ఆలయాన్ని ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు సమగ్ర నివేదికను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని అన్నారు. గొప్ప ఆధ్యాత్మిక ఆలయ సముదాయంగా అరసవల్లి ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ..

..వాయిస్...40 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పలు పట్టణ స్థానిక సంస్థల్లో ఖాళీ అయిన 12 స్థానాలకు నిన్న ఎన్నికలు నిర్వహించగా.. ఏడు స్థానాల్ని అధికార కూటమి ప్రభుత్వం గెలుచుకుంది. కోరం లేకపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో ఐదు చోట్ల ఎన్నిక ఈరోజుకి వాయిదా పడింది. వాయిదా పడిన ఐదు డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ స్థానాలకు ఈరోజు మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతి కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్, నందిగామ, పాలకొండల్లో ఛైర్‌పర్సన్, తుని, పిడుగురాళ్లలో వైస్ ఛైర్‌పర్సన్ స్థానాలకు ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

----------------------------

మరోవైపు తిరుమలలో రథసప్తమి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. రథసప్తమి సందర్భంగా ఈరోజు స్వామివారికి సప్తవాహనసేవలను తిరుమల తిరుపతి దేవస్థానం–టిటిడి నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ తెల్లవారుజామున  సూర్యప్రభ వాహనంపై మలయప్ప స్వామివారు మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సాయంత్రం వరకు  స్వామివారు పలు వాహనాలపై దర్శనమిస్తారు.

----------------------------

తెలంగాణలో నిర్ణీత గడువులోపు కులగణన పూర్తిచేశామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి  పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ లోని  గాంధీభవన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిన్న ఆయన మాట్లాడుతూ, కులగణనపై విమర్శలు చేసేవారు పునరాలోచించుకోవాలన్నారు. బీసీల సంక్షేమం కోసం గణన చేపట్టామని తెలిపారు. ఆ వివరాలను పబ్లిక్ డొమైన్‌లోఅందుబాటులో ఉంచుతామని, దీనిపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 30  సెకన్లు

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఇంజినీరింగ్ కళాశాలల్లో నాణ్యత ప్రమాణాలు పెంచడంపై యాజమాన్యాలు దృష్టి సారించాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సూచించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో  ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలతో మంత్రి నిన్న  సమావేశమయ్యారు. కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, ఇంటర్ విద్యలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. అన్ని విద్యాసంస్థల్లో స్థూల నమోదు నిష్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్లేస్‌మెంట్స్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి తెలపాలని పేర్కొన్నారు. విద్యావ్యవస్థలో నైతిక విలువలతో కూడిన సంస్కరణలు తేవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

======================